
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
ఆదివారం 25 ఆగస్టు 2024







ఎవరెవరు ఎక్కడెక్కడికి..? వెళ్లేది అటువైపా.. ఇటువైపా..? అటు వెళ్లాలనుకుంటే రేటెంత? ఇటువైపైతే ఇంకెంత..? సిఫార్సు లేఖలు ఉంటే సరిపోతుందా? లేకపోతే ఏమవుతుంది? ఇన్ని సవాలక్ష గందరగోళాల నడుమ రెండు జిల్లాల్లో ఉద్యోగుల బదిలీల ప్రక్రియ ప్రహసనంలా సాగుతోంది. ఈ నెలాఖరులోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ఓవైపు అధికారులు తలలు పట్టుకుంటుంటే, నచ్చినచోటకు వెళ్లడానికి ఉద్యోగులు సిఫార్సు లేఖలు తెచ్చుకుంటున్నారు. ప్రజాప్రతినిధులు ఆచితూచి అడుగులేస్తుంటే, పనిలోపనిగా దండుకునేందుకు ప్రైవేట్ వ్యక్తులు సిద్ధమైపోయారు.

బదిలీలల్లో బందీలు..!

జిల్లాల్లో ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల జాతర

- కోరుకున్న చోటకు వెళ్లేందుకు శతవిధాలా ప్రయత్నాలు
- కీలకంగా ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు
- ప్రసన్నం చేసుకున్న వారి పేర్లతో ప్రత్యేక జాబితాలు
- రెవెన్యూ ఉద్యోగులు పక్క జిల్లాలకు వెళ్లాలంటే ఓ రేటు
- కూటమి నాయకుల చుట్టూ 'ఆర్‌డబ్ల్యూఎస్' ఉద్యోగులు
- వెబ్‌కౌన్సెలింగ్ ద్వారానే సచివాలయ ఉద్యోగుల బదిలీలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : గతంలో రెవెన్యూ విభాగంలో డెప్యూటీ తహసీల్దార్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, వీఆర్వోలకు సంబంధించిన బదిలీలకు కలెక్టరేట్‌లో దరఖాస్తులు అందజేసేవారు. ఏ ప్రాంతానికి బదిలీ కోరుకుంటున్నారో తెలియజేసేవారు. ప్రస్తుతం ఈ పద్ధతి అమల్లో లేదు. కొంతమంది ఉద్యోగులు ఎమ్మెల్యేల వద్దకు వెళ్లి సిఫార్సు లేఖలను తెచ్చుకుని, వారు పనిచేసే కార్యాలయాల్లోనే దరఖాస్తులు ఇచ్చుకుంటున్నారు. అయితే, బదిలీలకు సంబంధించిన జాబితాలు కలెక్టరేట్‌లో తయారు చేస్తారా లేక శాసనసభ్యుల పీఏలు తయారుచేసి కలెక్టరేట్‌కు పంపుతారా అనే సందిగ్ధత వీడట్లేదు. ఇటీవల వరకు కలెక్టర్ సెలవులో ఉండటంతో సోమ, మంగళవారం నాటికి ఈ అంశంపై స్పష్టత వస్తుందని రెవెన్యూ ఉద్యోగులు అంటున్నారు.

రేటు చెల్లిస్తే రూటు క్లియర్

రెవెన్యూ విభాగంలో ఐదేళ్లుగా ఒకే ప్రాంతంలో పనిచేస్తూ తప్పనిసరిగా బదిలీ కావాల్సిన వివిధ హోదాల్లో ఉన్న ఉద్యోగులు ఎన్టీఆర్ జిల్లాకు వెళ్లేందుకు ఆసక్తిగా ఉన్నారు. ఇదే అదనుగా చేసుకుని ఒక ప్రజాప్రతినిధి పీఏ మీకు నేనున్నానంటూ అభయమిచ్చేస్తున్నాడని రెవెన్యూ ఉద్యోగులు చెబుతున్నారు. తానే బదిలీ జాబితాలను తయారు చేస్తున్నానని చెబుతూ, తెరవెనుక చక్రం తిప్పడం వివాదాస్పదమవుతోంది. గతంలో పలు ఆరోపణలు ఎదుర్కొన్న ఈ ఉద్యోగి ప్రస్తుతం రెవెన్యూ విభాగం ఉద్యోగుల బదిలీల్లో కీలకంగా వ్యవహరిస్తూ పెద్దమొత్తంలో నగదు వసూళ్లకు పాల్పడుతున్నారని చెప్పుకొంటున్నారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా ఈ పీఏ వ్యవహారశైలి ఉండటంతో అసలు విషయాన్ని ప్రజాప్రతినిధికి తెలియజేస్తామని ఉద్యోగులు అంటున్నారు. ఎన్టీఆర్ జిల్లాకు బదిలీపై వెళ్లే వీఆర్వోలకు సంబంధించిన జాబితాలను ప్రజాప్రతినిధి పీఏ ఇప్పటికే తయారుచేసినట్లు సమాచారం. దీంతో ఎమ్మెల్యేల నుంచి సిఫార్సు లేఖలు తెచ్చుకోలేనివారు తమను ఏ ప్రాంతాలకు బదిలీ చేస్తారనే అంశంపై గందరగోళం ఏర్పడింది. జిల్లాల విభజన తరువాత పదోన్నతులు పొంది ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలకు బదిలీపై వెళ్లిన రెవెన్యూ విభాగంలోని ఉద్యోగులు ప్రస్తుతం జరుగుతున్న బదిలీల్లో కృష్ణాజిల్లాకు వచ్చేందుకు దరఖాస్తులు చేసుకున్నట్లు రెవెన్యూ అసోసియేషన్ నాయకులు చెబుతున్నారు. ఈ విభాగంలో కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలకు వెళ్లేందుకు దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులను బదిలీ చేయాలంటే పరస్పర అంగీకారం ఉండాలని, ఈ అంశంపై అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోననే చర్చ నడుస్తోంది.

ఆర్‌డబ్ల్యూఎస్‌లో హడావిడి

ఆర్‌డబ్ల్యూఎస్ విభాగంలో పెద్ద ఎత్తున పైరవీలు నడుస్తున్నాయి. ఈ విభాగంలో ఐదేళ్ల పైబడి ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న ఏఈలు, కిందిస్థాయి ఉద్యోగులు తాము ప్రస్తుతం పనిచేస్తున్న ప్రాంతంలోనే కొనసాగేందుకు తమ వంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. గుడివాడ, మచిలీపట్నం డివిజన్లలోని ఆర్‌డబ్ల్యూఎస్ విభాగంలో పనిచేసే ఉద్యోగుల మధ్య పోటీ తీవ్రంగా ఉంది. దీంతో అధికారులు కూటమికి చెందిన ద్వితీయశ్రేణి నాయకుల ద్వారా మంతనాలు జరుపుతున్నారు. ఎలాగైనా వారు కోరుకున్న ప్రాంతాలకు బదిలీ చేయించుకునేందుకు లేదా బదిలీ నిలిపి వేయించుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

29, 30 తేదీల్లో సచివాలయ ఉద్యోగుల బదిలీలు

జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను బదిలీ చేసేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలను ప్రభుత్వం విడుదల చేయడంతో బదిలీ కోరుకునే సచివాలయ ఉద్యోగులు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఈనెల 29, 30 తేదీల్లో సచివాలయ ఉద్యోగుల బదిలీలను వెబ్ కౌన్సెలింగ్ ద్వారా నిర్వహిస్తామని అధికారులు చెబుతున్నారు.

ప్లీజ్.. ఇక వెళ్లండి..!

పంచాయతీ కార్యదర్శుల బలవంతపు బదిలీలు

- రిక్వెస్టులు పెట్టాలంటూ ఆదివారం నాటికి డెడ్‌లైన్
- నియోజకవర్గాలవారీగా గంపగుత్తగా సాగనంపేందుకే..

వైసీపీతో అంటకాగిన వారిని పంపేయాలంటున్న ఎమ్మెల్యేలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పంచాయతీ కార్యదర్శుల బదిలీల పేరుతో ఉమ్మడి జిల్లాలో పైరవీలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ ఆదేశాలకు భిన్నంగా అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్ పేరుతో ఎడాపెడా బదిలీలు చేసేస్తున్నారు. గంపగుత్తగా బదిలీలకు రంగం సిద్ధంచేసేందుకు రిక్వెస్టులు పెట్టుకోవాలని ఆదేశిస్తున్నారు. ఇందుకు ఆదివారాన్ని డెడ్‌లైన్‌గా విధించారు. దీంతో పంచాయతీ కార్యదర్శుల్లో ఆందోళన నెలకొంది. పంచాయతీ కార్యదర్శుల పోస్టింగ్‌లకు సంబంధించి రెండు జిల్లాల్లోని డీపీవో కార్యాలయాలు బేరాలకు దిగటం విమర్శలకు దారి తీస్తోంది. ఐదేళ్లుగా ఒకేచోట పనిచేసినప్పటికీ మెడికల్ గ్రౌండ్స్, స్పౌస్ ఆధారిత విజ్ఞాపనలు, ఇతర రిక్వెస్టు బదిలీలను పరిగణనలోకి తీసుకోవాల్సిన పంచాయతీ అధికారులు అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్ పేరుతో అందరితో బలవంతంగా రిక్వెస్టులు పెట్టిస్తూ, ఈ వ్యవహారం వెనుక మామూళ్లపర్వానికి తెరలేపారు. రిక్వెస్టులు పెట్టాలంటూ కృష్ణాజిల్లా డీపీవో కార్యాలయం నుంచి పంచాయతీ కార్యదర్శులకు పెద్ద ఎత్తున ఫోన్లు వస్తుండటం గమనార్హం.

డీపీవో కార్యాలయ సిబ్బంది ఓవరాక్షన్

ఎమ్మెల్యేలు గంపగుత్తగా బదిలీలు చేయమన్నారన్న పేరుతో డీపీవో కార్యాలయ సిబ్బంది ఓవరాక్షన్ చేస్తున్నారు. ఈ బదిలీల విషయంలో అధికార పార్టీ ఎమ్మెల్యేలు కూడా మొండిగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు. గత ప్రభుత్వ హయాంలో ఆ పార్టీకి అంటకాగి పంచాయతీ కార్యదర్శులుగా కొనసాగిన వారెవరూ తమ నియోజకవర్గాల్లో కనిపించకూడదని, మూకుమ్మడి బదిలీలు చేయాలని జిల్లా యంత్రాంగంపై ఒత్తిడి తెస్తున్నారు.

ఉమ్మడి జిల్లా పంచాయతీ కార్యదర్శుల్లో కొంతమంది మహిళలు ఉన్నారు. వీరిలో కొంతమందికి ఆరోగ్య సమస్యలు ఉన్నాయి. మరికొందరి భర్తలు దూర ప్రాంతాల్లో ఉంటున్నారు. వీరి పిల్లలు స్థానికంగా స్కూళ్లలో చదువుకుంటున్నారు. ఇప్పటికే విద్యా సంవత్సరం ప్రారంభమైంది. రెండు నెలలు కూడా గడిచిపోయింది. ఇప్పటికిప్పుడు బదిలీలు అంటే పిల్లల్ని మరోచోట పాఠశాలల్లో చేర్పించాల్సి ఉంటుంది. పోనీ.. స్థానిక మండలం పరిధిలోని గ్రామాలకు బదిలీ చేస్తే, స్కూళ్లకు మార్చే అవకాశం ఉండదు. నియోజకవర్గంలోనే పనిచేయకూడదంటే.. మహిళా పంచాయతీ కార్యదర్శులు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉంది.

మహిళా కార్యదర్శులకు వెసులుబాట్లు లేవా..?

అయితే, ప్రభుత్వం బదిలీల విషయంలో స్పష్టమైన ఆదేశాలిచ్చింది. ఒకే స్థానంలో ఐదేళ్లు పూర్తి చేసుకుని ఉంటే, అలాంటి వారిని బదిలీ చేయాల్సి ఉంది. కానీ, ఐదేళ్లు పూర్తి చేసుకోకపోయినా కదిలించాలనుకోవటం గమనార్హం. మహిళా ఉద్యోగుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని వారెక్కడికి కోరుకుంటున్నారో అక్కడ పోస్టింగ్ ఇప్పించాల్సి ఉండగా, బలవంతపు రిక్వెస్టుల పేరుతో ఎడాపెడా బదిలీలకు నిర్దేశించటం గమనార్హం. అధికార పార్టీ ఎమ్మెల్యేల నుంచి అందిన జాబితాల ప్రకారం బదిలీలు చేసేందుకు డీపీవో కార్యాలయాలు సిద్ధమవుతున్నాయి. సందట్లో సడేమియాగా డీపీవో కార్యాలయ సిబ్బంది కూడా నచ్చినచోట పోస్టింగ్‌లు ఇప్పిస్తామంటూ రూ.లక్షలు డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారం కృష్ణాజిల్లా డీపీవో కార్యాలయ పరిధిలో ఎక్కువగా జరుగుతోంది. ఇప్పటికే పలువురితో ప్యాకేజీలు కుదుర్చుకున్నట్టుగా తెలుస్తోంది. ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొచ్చేలా జరుగుతున్న బదిలీలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

కొత్త చట్టాలతో ప్రజాస్వామ్యానికి చేటు

- న్యాయవాదుల ధర్నాలో వక్తలు

6లో..

డిప్యుటేషన్ మాకొద్దు..!

సీఆర్‌డీఏకు వచ్చేందుకు రెవెన్యూ అధికారులు ససేమిరా..

- కమిషనర్ భాస్కర్ ప్రతిపాదనలు బేఖాతరు
- డిప్యుటేషన్ ఆదేశాలిచ్చినా ఇంకా వెనుకంజ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సీఆర్‌డీఏ) రెవెన్యూ విభాగంలోకి డిప్యుటేషన్‌పై రావటానికి అధికారులు, ఉద్యోగులు హడలెత్తిపోతున్నారు. రెవెన్యూ శాఖ నుంచి రావటానికి అనాసక్తి చూపిస్తున్నారు. రాజధాని ప్రాంతంలో భూసంబంధిత అంశాలను నిర్వహించటానికి రెవెన్యూ విభాగాన్ని బలోపేతం చేయాలని సీఆర్‌డీఏ కమిషనర్ భాస్కర్ నిర్ణయించారు. ఈ మేరకు అడిషనల్ కమిషనర్లతో చర్చించి సమర్థవంతులైన వారిని ఆయన ఎంపిక చేశారు. ఎంపికైన తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్ఐ, వీఆర్వో, వీఆర్ఏలను ఏడాది కాలానికి సీఆర్‌డీఏకు డిప్యుటేషన్‌పై పంపించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ ప్రతిపాదనను రాష్ట్ర భూ పరిపాలనా శాఖ (సీసీఎల్ఏ)కు ప్రభుత్వం బదలాయించింది. ఎంపికైన వారంతా డిప్యుటేషన్‌పై సీఆర్‌డీఏకు రావాలంటూ సీసీఎల్ఏ ఆదేశించింది. ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఆరుగురు తహసీల్దార్లు, నలుగురు డీటీలతో పాటు పెద్దసంఖ్యలో వీఆర్వోలు, వీఆర్ఏలను కోరింది. బదిలీల నేపథ్యంలో ఆయా మండలాల బాధ్యతలు స్వీకరించి రెండు వారాలు కూడా కాకముందే సీఆర్‌డీఏకు రమ్మనడం ఏమిటని వారంతా ఆశ్చర్యపోయారు. కొంతమంది ఓకే.. చెప్పినా, చాలామంది మాత్రం ఆసక్తి చూపించట్లేదు. కలెక్టర్ ఆదేశాలు ఇవ్వాలంటూ మెలిక పెడుతున్నారు. కాగా, సీసీఎల్ఏ అధికారులు ముందుగా కలెక్టర్లకు సమాచారం తెలపకపోవటంతో రెండు జిల్లాల కలెక్టర్లు ఖిన్నులైనట్లు సమాచారం. దీంతో సీసీఎల్ఏ ఈ విషయాన్ని కలెక్టర్ల దృష్టికి తీసుకెళ్లింది. అయితే, పలువురు అధికారులను ఇక్కడి నుంచి పంపటానికి కలెక్టర్లు కూడా ఇష్ట పడలేదు. ఈ పరిణామాలు సీఆర్‌డీఏలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ మొత్తం తతంగంపై కమిషనర్ భాస్కర్ ఆగ్రహంతో ఉన్నట్టు సమాచారం. ప్రస్తుతం కమిషనర్ ప్రపంచ బ్యాంకు బృంద పరిశీలనలో ఉన్నారు. సోమవారం నుంచి దృష్టిసారించే అవకాశముంది.

గంజాయిపై ఉక్కుపాదం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ ఆర్.గంగాధరరావు

నిరంతర నిఘా.. పట్టుబడితే వెంటనే అరెస్టు

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

- శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై దృష్టి
- వినాయక చవితి ఉత్సవాలకు పక్కా ప్రణాళిక
- వ్యాపార కూడళ్లలో సీసీ కెమెరాలతో పర్యవేక్షణ
- జిల్లా నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ గంగాధరరావు

మచిలీపట్నం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గంజాయి విక్రయాలపై నిరంతర నిఘా ఉంచి, ఉక్కుపాదం మోపుతామని ఎస్పీ ఆర్.గంగాధరరావు స్పష్టం చేశారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో శనివారం నేర సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి రవాణా చేస్తున్న, విక్రయాలు జరుపుతున్న వారిపై పటిష్ట నిఘా ఉంచుతామన్నారు. ఎక్కడి నుంచి సరుకు తెస్తున్నారు, ఎలా తరలిస్తున్నారు, విక్రయాలు ఎలా చేస్తున్నారు తదితర అంశాలపై పూర్తిస్థాయి నిఘా ఉంచుతామన్నారు. గంజాయి విక్రయాలు జరుపుతున్న వారిని ఉపేక్షించకుండా వెంటనే అరెస్టు చేయాలని పోలీసులకు సూచించారు. పోలీసు అధికారులు వారి పరిధిలో జరిగే ప్రతి అంశాన్నీ నిశితంగా పరిశీలించాలని సూచించారు. స్టేషన్‌కు వచ్చే బాధితులతో మంచిగా మాట్లాడాలని, వారి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. దొంగతనాలు చేసే వారిపై నిఘా ఉంచాలని, ఈ తరహా నేరాలకు పాల్పడేవారి కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. రాత్రి గస్తీని ముమ్మరం చేసి అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకోవాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలు, నేరాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో విజిబుల్ పోలీసింగ్ విధానాన్ని అమలు చేయాలన్నారు. మహిళలపై నేరాలు జరగకుండా, వారి సంరక్షణ కోసం సచివాలయాల్లో పనిచేసే మహిళా పోలీసుల నుంచి కొంతమేర సమాచారం రాబట్టాలన్నారు. జిల్లాలో సైబర్ నేరాలు అధికంగా నమోదవుతున్నాయని, వీటి బారిన పడకుండా ప్రజలకు కనీస అవగాహన కల్పించేందుకు అధికారులు చొరవ చూపాలన్నారు. ఇప్పటికే ఆయా పోలీస్ స్టేషన్లలో నమోదైన సైబర్ నేరాలకు సంబంధించిన కేసులను త్వరగా పరిష్కరించాలన్నారు. ఇందుకోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నామని, అవసరమైన మేరకు ఫొరెన్సిక్స్ టూల్స్‌ను కొనుగోలు చేస్తామన్నారు. ఈ టూల్స్‌ను వినియోగించే అంశంపై అధికారులకు త్వరలో శిక్షణ ఇస్తామని ఎస్పీ తెలిపారు. సబ్ డివిజన్ స్థాయిలో ఒక కమిటీని ఏర్పాటు చేసి సైబర్ నేరాల అదుపునకు, కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

చవితి ఉత్సవాలు ప్రశాంతంగా జరగాలి

వచ్చే నెలలో వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా జరగాలని, విగ్రహాల ఏర్పాటుపై కమిటీ సభ్యులతో మాట్లాడి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని ఎస్పీ పోలీసు అధికారులకు సూచించారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యాపార సముదాయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. నిఘా పటిష్టంగా ఉంటే, దొంగతనాలకు పాల్పడేవారిని త్వరగా గుర్తించే అవకాశం ఉంటుందన్నారు. రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి వాహనాల వేగ నియంత్రణకు స్టాప్ బోర్డులు, హెచ్చరిక బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడి ఈ అంశంపై అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లావ్యాప్తంగా కోడిపందేలు, పేకాట శిబిరాలపై నిఘా ఉంచడంతో పాటు క్రికెట్ బెట్టింగ్‌లు నిర్వహించే బుకీలను గుర్తించి అదుపులోకి తీసుకోవాలని ఎస్పీ సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి కదలికలపైనా నిరంతర నిఘా ఉండాలని పేర్కొన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నాలు చేస్తున్న వారిని గుర్తించి అదుపులోకి తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏఆర్ ఏఎస్పీ ఎస్‌వీడీ ప్రసాద్, డీఎస్పీలు అబ్దుల్‌సుబాన్, పి.మురళీధర్, సీహెచ్ శ్రీనివాసరావు, ఎస్‌బీ సీఐ రంగనాథ్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

శాంతి ర్యాలీ



మహిళలపై జరుగుతున్న హత్యాచారాలను అరికట్టాలని, వారికి భద్రత కల్పించాలని, కోల్‌కతాలో జరిగిన దుర్ఘటనలో బాధితులకు న్యాయం జరగాలని కోరుతూ స్టెల్లా కళాశాల ఆధ్వర్యంలో శనివారం విజయవాడలో శాంతి ర్యాలీ నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థినులు ర్యాలీ నిర్వహించి, అనంతరం బెంజిసర్కిల్ వద్ద మానవహారంగా నిలబడ్డారు.



జస్టిస్ శ్రీనరసింహకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు

దుర్గమ్మ సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి

వన్‌టౌన్, ఆగస్టు 24 : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో శనివారం ఖడ్గమాలార్చనలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహ పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించిన అనంతరం మల్లేశ్వరాలయంలో స్వామివారి అభిషేక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉపాలయాలను సందర్శించారు. వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకుని ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అధికారులు ప్రోటోకాల్ మర్యాదలను అందజేశారు. డిప్యూటీ ఈవో లీలాకుమార్ ప్రసాదం, శేషవస్త్రం, దుర్గమ్మ చిత్రపటం అందజేశారు. వేద పండితులు ఆశీస్సులు అందచేశారు.

దుర్గమ్మను దర్శించుకున్న దేవదాయ కమిషనర్



కనకదుర్గమ్మవారిని శనివారం దేవదాయ శాఖ కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం ప్రసాదం, శేష వస్త్రం, చిత్రపటం, ఆశీస్సులు అందజేశారు.

అన్నవితరణకు విరాళం..



దేవస్థానంలో అన్నవితరణ కార్యక్రమానికి విశాఖపట్నం, సీతమ్మధార ప్రాంతానికి చెందిన ఎంవీ సింధూజ, ఎం.స్నిగ్ధలు శనివారం ఆలయానికి విచ్చేసి సంయుక్తంగా రూ.3,00,000లు విరాళాన్ని చెక్కు రూపంలో ఏఈవో రమేష్ ద్వారా దేవస్థానానికి అందజేశారు.

రేపు దుర్గగుడిలో కృష్ణాష్టమి వేడుకలు

ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ఈనెల 26న కృష్ణాష్టమి వేడుకలను నిర్వహిస్తున్నట్టు ఈవో రామారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 8 గంటలకు ఆలయంలో రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణ భగవానునికి పూజా కార్యక్రమం జరుగుతుందని, అదే సమయంలో శాస్త్రోక్త విధానంలో గోపూజ నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు దేవస్థాన పురాణ పండితులు కృష్ణాష్టమి విశిష్టత, శ్రీకృష్ణుడి అవతార విశేషాలను గురించి ఉపన్యాస కార్యక్రమం, సాయంత్రం 6.30 గంటలకు రాజగోపురం వద్ద ఖాళీ ప్రదేశంలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు.



నియామక పత్రాలను అందజేస్తున్న నక్కా కృష్ణగౌడ్

గౌడ హక్కుల పరిరక్షణ సమితి ప్రచార కార్యదర్శిగా బొల్లా వెంకటేశ్వరరావు గౌడ్

వన్‌టౌన్, ఆగస్టు 24 : గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి జాతీయ ప్రచార ప్రధాన కార్యదర్శిగా కృష్ణాజిల్లా చల్లపల్లికి చెందిన బొల్లా వెంకటేశ్వరరావు గౌడ్ నియామకమయ్యారు. ఈమేరకు హైదరాబాద్‌లోని సమితి కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో సంఘం జాతీయ అధ్యక్షుడు నక్కా కృష్ణగౌడ్ పలు పదవులకు నియామక పత్రాలు అందజేశారు. బొల్లా వెంకటేశ్వరరావు జాతీయ ప్రచార ప్రధాన కార్యదర్శి, జాతీయ ప్రధాన కార్యదర్శిగా నక్కా మహేంద్ర గౌడ్, ఏపీ వర్కింగ్ ప్రెసిండెంట్‌గా చిట్టిబొమ్మ వంశీకృష్ణ గౌడ్ (విజయవాడ అశోక్‌నగర్), కృష్ణాజిల్లా అధ్యక్షుడిగా బెజవాడ నాగేశ్వరరావు గౌడ్ (మానికొండ), కృష్ణాజిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పిల్లి రామారావు గౌడ్ (గొల్లనపల్లి)లకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా బొల్లా వెంకటేశ్వరరావు గౌడ్ మాట్లాడుతూ, ప్రభుత్వం తరపున గౌడ కులస్తులకు సహాయం అందేవిధంగా కృషి చేస్తానన్నారు. టీడీపీ బీసీల పార్టీ అన్నారు. సీఎం చంద్రబాబు బీసీలను ఆదుకోవటంలో ఎప్పుడూ ముందుంటారని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన కృష్ణగౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవాలి

- సీపీ రాజశేఖరబాబు

విజయవాడ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : పోలీసులు వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలని కమిషనర్ రాజశేఖరబాబు అన్నారు. ముఖ్యంగా సైబర్ నేరాల నియంత్రణకు సంబంధించి ఎంపిక చేసిన సైబర్ కమాండోలు సాంకేతిక పరిజ్ఞానంపై పూర్తిస్థాయిలో పట్టును సాధించాలని అభిప్రాయపడ్డారు. ఎంజీ రోడ్డులో ఆపరేషనల్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సైబర్ కమాండోలతో శనివారం రాత్రి సమావేశం నిర్వహించారు. సైబర్ నేరాలు జరుగుతున్న తీరు, ప్రజలు మోసపోతున్న విధానాలపై పూర్తిగా అవగాహన పెంచుకోవాలన్నారు. వాటిని విశ్లేషిస్తూ సైబర్ సోల్జర్స్‌ను అవగాహన పెంచాలన్నారు. ఆన్‌లైన్ గేమ్స్, లోన్స్, క్యూఆర్ కోడ్, పార్ట్‌టైం ఉద్యోగాలు, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం లింక్‌లు, ట్విట్టర్, టెలిగ్రాం లింక్, ఓఎల్‌ఎక్స్ మోసాలపై సమగ్రంగా వివరాలు తెలుసుకోవాలన్నారు. సైబర్ నేరాలు ఎప్పటికప్పుడు కొత్త తరహాలో జరుగుతున్న దానికి అనుగుణంగా నైపుణ్య సామర్థ్యాన్ని పెంచుకోవాలని చెప్పారు. కమాండ్ కంట్రోల్ సెంటర్, కంట్రోల్ రూంను పరిశీలించారు. సీసీ కెమెరాల ద్వారా నగరంలో ట్రాఫిక్‌ను పరిశీలిస్తూ రద్దీ ఉన్న ప్రాంతాలను గుర్తించి ఆ సమాచారాన్ని అధికారులకు తెలియజేయాలని ఆదేశించారు. సమావేశంలో డీసీపీలు టి.హరికృష్ణ, గౌతమీ షాలి, ఉదయరాణి, సైబర్ క్రైం ఏసీపీ తేజేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ గుణరాము, పి.శ్రీను, వాసిరెడ్డి శ్రీనివాస్, హనీష్ తదితరులు పాల్గొన్నారు.



సీఈవోకు వినతిపత్రం సమర్పిస్తున్న యూటీఎఫ్ నేతలు

కారుణ్య నియామకాలు చేపట్టాలి

- సీఈవోకు యూటీఎఫ్ నేతల వినతి

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 24 : మృతిచెందిన ఉద్యోగుల కుటుంబసభ్యులను కారుణ్య నియామకాలు చేపట్టాలని జడ్పీ ఇన్‌చార్జి సీఈవో ఆర్సీ ఆనందకుమార్‌కు ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల నాయకులు ఎ.సుందరయ్య, జె.లెనిన్‌బాబు, కేఏ ఉమామహేశ్వరరావు, ఎస్.కృష్ణయ్య, సంజీవరెడ్డి, ముత్తయ్య, నరసింహారావు, ముక్తేశ్వరరావులు వినతిపత్రం సమర్పించారు. విజయవాడ, మచిలీపట్నం, గుడివాడ పాఠశాలల్లోని ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించాలన్నారు. చాలాకాలంగా పదోన్నతులు లేకపోయినా సెకండరీ గ్రేడ్ టీచర్లు హైస్కూళ్లలో పనిచేస్తున్నారన్నారు. విజయవాడ కార్పొరేషన్ పరిధిలో అర్హత గల ఎస్జీటీలు, భాషా పండితులకు కామన్ సీనియారిటీ ఆధారంగా పదోన్నతులు కల్పిస్తున్నట్టు, అదే విధంగా మచిలీపట్నం, గుడివాడ పరిధిలోని అర్హత గల సెకండరీ గ్రేడ్, భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలని కోరారు.

కొత్త చట్టాలతో ప్రజాస్వామ్యానికి చేటు

- న్యాయవాదుల ధర్నాలో వక్తలు



ధర్నా కార్యక్రమంలో మాట్లాడుతున్న సుంకర రాజేంద్రప్రసాద్

విజయవాడ లీగల్, ఆగస్టు 24 : ప్రజాస్వామ్య హక్కులను హరించే నూతన క్రిమినల్ చట్టాల అమలును నిలుపుదల చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. శనివారం రాష్ట్రంలోని పలుప్రాంతాల నుంచి వచ్చిన న్యాయవాదులు, ప్రజాసంఘాల, పౌరహక్కుల, మహిళా సంఘాల నేతలు విజయవాడ ధర్నాచౌక్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఏఐఎల్‌యూ) జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, కాలం చెల్లిన వలస పాలకుల చట్టాలను రద్దుచేస్తూ.. నూతన చట్టాలను తీసుకొచ్చామని కేంద్రప్రభుత్వం ప్రగల్భాలు పలుకుతోందని, కానీ నూతన చట్టాలలో పాతచట్టాలనే 90 నుంచి 95 శాతం వరకు మక్కీకి మక్కీగా కొత్తచట్టాలలో చేర్చారని ఆందోళన వ్యక్తం చేశారు. చట్టాల పేర్లు, సెక్షన్లు, చాప్టర్లు మార్చారని, చేసిన కొద్దిపాటి మార్పులు రాజ్యాంగ విరుద్ధంగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేవిగా వున్నాయన్నారు. 'ఉపా యాక్టు, కోకా యాక్టు, టెర్రరిస్టు యాక్ట్, దేశద్రోహం' పేరుతో నూతన సెక్షన్లను బీఎన్‌ఎస్‌లో చేర్చారని, దీనివలన పోలీసు అధికారులకు విశృంఖలమైన అధికారాలు సంక్రమించాయని, తద్వారా పోలీసులు యథేచ్ఛగా ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తారని చెప్పారు. ఏఐఎల్‌యూ జాతీయ ప్రధాన కార్యదర్శి పీవీ సురేంద్రనాథ్ మాట్లాడుతూ, పార్లమెంట్‌లో ఏమాత్రం చర్చలేకుండా ఈ చట్టాలను తీసుకొచ్చారని, బ్రిటీష్ వలసపాలకులు కూడా చేయని దుర్మార్గమైన చట్టాలను చేశారన్నారు. ఏఐఎల్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లూరి మాధవరావు సభకు అధ్యక్షత వహించి మాట్లాడుతూ, ఈ నూతన చట్టాలను రద్దు చేసేవరకు పోరాటం చేయాల్సిన అవసరం వుందని, న్యాయవాదులు ప్రజలను చైతన్యం చేయాల్సిన అవసరం వుందని అన్నారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) జాతీయ ప్రధాన కార్యదర్శి చలసాని అజయ్‌కుమార్ మాట్లాడుతూ, నూతన చట్టాల వలన ప్రజలకు ఏమాత్రం ప్రయోజనం లేదని, ప్రజల హక్కులను కాలరాస్తున్నాయన్నారు. ఈ ఉద్యమాన్ని తాము బలపరుస్తున్నామన్నారు. హైకోర్టు న్యాయవాది వై.కోటేశ్వరరావు (వై.కే) మాట్లాడుతూ, హక్కులను రద్దుచేయడం వలన ప్రజలు, పోలీసులపైన ప్రభుత్వ అధికారులపైన ఏ విధమైన చర్యలు తీసుకోలేని పరిస్థితి వస్తుందన్నారు. ఈ చట్టాలు పౌరహక్కులకు భంగం కలిగిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ లీగల్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు వి.గురునాథం మాట్లాడుతూ, పోలీసులు అరెస్టు చేసి సంకెళ్లు వేయడం ఆటవిక సంప్రదాయమని, గతంలో సుప్రీంకోర్టు అనేక సందర్భాల్లో దానిని వ్యతిరేకించిందని, అది రాజ్యాంగ విరుద్ధమని కూడా చెప్పిందన్నారు. నూతన చట్టాలలో ఆ హక్కు పోలీసులకు కల్పించారని మండిపడ్డారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు, మాజీ ఎమ్మెల్యే గఫూర్ మాట్లాడుతూ, ఢిల్లీలో రైతులు చేసిన పోరాట పటిమతో ఉద్యమం చేసి విజయం సాధించాలని, దానికి సీపీఎం మద్దతు వుంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో ఏఐఎల్‌యూ, ఐఏఎల్, కాంగ్రెస్ లీగల్‌సెల్, ఏపీసీఎల్‌ఏ, సీఎల్‌సీ, ఐపీఎల్, ఓపీడీఆర్, మహిళా సంఘాలు, పౌరహక్కులు, ప్రజా సంఘాలు, హైకోర్టు న్యాయవాదులు, సెంటర్ ఫర్ సోషల్ జస్టిస్‌కు చెందిన వడ్డే శోభనాద్రీశ్వరరావు, దోనేపూడి కాశీనాథ్, మట్టా జయకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు

చంద్రబాబుపై నమ్మకంతోనే.. కూటమికి పట్టం కట్టారు

- అమరావతిని సత్వరం అభివృద్ధి చేయాలి
- మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

ధర్నాచౌక్, ఆగస్టు 24 : గాడి తప్పిన రాష్ట్రాభివృద్ధిని తిరిగి గాడిలో పెడతారనే నమ్మకంతో జగన్ అరాచక పాలనకు చరమగీతం పాడిన రాష్ట్ర ప్రజలు చంద్రబాబుకు పట్టం కట్టారని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. అమరావతిని త్వరిగతిన అభివృద్ధి చేయాలన్నారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు, ప్రజల సత్వర సమగ్ర అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు కొన్ని నిర్మాణాత్మక సూచనలతో బహిరంగ లేఖ రాసినట్టు చెప్పారు. అమరావతి రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులు సీఆర్డీఏతో చేసుకున్న అగ్రిమెంట్ ప్రకారం మూడేళ్లలో రైతులకు కేటాయించిన నివాస, వాణిజ్య ప్లాట్ల లేఅవుట్లను రహదారులు, డ్రైన్లు తదితర మౌలిక వసతులతో సహా అభివృద్ధి చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అసంపూర్తిగా ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. రాష్ట్రాభివృద్ధికి ప్రత్యేక హోదా ఎంతో కీలకమని ప్రత్యేక హోదా సాధనకు చంద్రబాబు కృషి చేయాలన్నారు. తుగ్లక్ జగన్ విద్యుత్ మీటర్లకు అమర్చిన స్మార్ట్ మీటర్లను తక్షణమే తీసివేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కును పరిరక్షించాలన్నారు. పోరాడి కార్మికులు సాధించుకున్న 42 కార్మిక చట్టాలను రద్దు చేసి తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్రంలో చర్చించి ఉపసంహరించుకునేలా చేయాలన్నారు.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా!

- కిడ్నీ వ్యాధి శాశ్వత పరిష్కారానికి పోరాటలే మార్గం
- సీపీఎం నేత బాబూరావు





బండిపై వచ్చిన బాధితుడు

ఎ.కొండూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కిడ్నీ బాధితులు

ఎ.కొండూరు, ఆగస్టు 24 : ఎ.కొండూరు మరో ఉద్దానంగా మారకముందే ప్రభుత్వం కిడ్నీ వ్యాధికి శాశ్వత పరిష్కారం చూపాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సీహెచ్ బాబురావు, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని కిడ్నీ బాధితులతో కలిసి ఎ.కొండూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జిల్లాలో గత పదేళ్లలో కిడ్నీ వ్యాధితో వెయ్యిమంది మృతి చెందారని, ఇప్పటికి రెండు వేలమంది వ్యాధితో, 110 మంది డయాసిస్ చేయించుకుంటున్నారన్నారు. ఎ.కొండూరు మండలంలో ఈ సంవత్సరం 63 మృతి చెందినట్టు తెలిపారు. ఈ మరణాలకు ప్రభుత్వాల నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. పార్టీలు మట్టి మాఫియాలపై సవాళ్లు, చర్చలు కాదు, నియోజకవర్గంలో కిడ్నీవ్యాధి, మరణాలపై చర్చకు రావాలని కోరారు. వ్యాధి శాశ్వత పరిష్కారానికి ముఖ్యమంత్రి అఖిలపక్ష సమావేశం, అధ్యయన బృందాన్ని ఏర్పటుచేయాలని డిమాండ్ చేశారు. మండలంలో మంచినీరు లేకపోయినా 100కి పైగా బెల్టుషాప్‌లు, నాటు సారా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రూ. 50 కోట్లతో కిడ్నీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం, ప్రతి గ్రామానికి కృష్ణా జలాలు, తిరువూరు నియోజకవర్గంలో కిడ్నీ సమస్య అధ్యయనం కోసం ప్రత్యేక నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేయాలని, డయాలసిస్ రోగులకు రూ. 20 వేలు, వ్యాధిగ్రస్తులకు ఐదు వేలు పింఛన్, మృతుల కుటుంబాలకు ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా, ఎకరా భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ బి.ఆశయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు పీవీ ఆంజనేయులు, శ్రీనివాసరావు, కళ్యాణ్, నాగేంద్రప్రసాద్, వెంకటేశ్వరావు, ఆనందరావు, సీతా రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బాధితుల వ్యథ పాలకులకు పట్టదా? : సీపీఐ



ధర్నాచౌక్ : ప్రాణాలు కోల్పోతున్న కిడ్నీ బాధితుల వ్యథలు పాలకులకు పట్టడం లేదని, కూతవేటు దూరంలో కృష్ణా జలాలు ఉన్నా సరఫరా చేసే నాధుడే లేరని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ ధ్వజమెత్తారు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో నిర్వహించనున్న 'ప్రజా ఆరోగ్య పరిరక్షణ పాదయాత్ర' పోస్టర్‌ను స్థానిక దాసరిభవన్‌లో శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరువూరు నియోజకవర్గం ఎ.కొండూరు, గంపలగూడెం మండలాలు కిడ్నీ బాధితుల ఆవాస కేంద్రాలుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.50 కోట్లతో కృష్ణాజలాలను సరఫరా చేస్తామన్నా ప్రభుత్వ చర్యలు ముందుకు సాగడం లేదని విమర్శించారు. ఎ.కొండూరు నుంచి విజయవాడ లెనిన్ సెంటర్ వరకు కొనసాగే పాదయాత్రను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈనెల 29న లెనిన్ సెంటర్‌లో సాయంత్రం ముగింపు సభ జరుగుతుందన్నారు. సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తదితరులు సభలో ప్రసంగిస్తారన్నారు.

వికసిత్ ఏపీ ప్రతిపాదనలు సిద్ధం చేయండి

- కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ



మచిలీపట్నం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : వికసిత్ ఆంధ్రప్రదేశ్-2047కు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశపుహాలులో శనివారం జిల్లా అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రప్రభుత్వ సూచనల మేరకు వికసిత్ ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదనల్లో భాగంగా జిల్లాకు సంబంధించిన అంశాలను జోడిస్తూ నివేదికను తయారు చేయాలన్నారు. ప్రస్తుతం జిల్లాలో రూ.78వేలకోట్ల ఉత్పత్తులు జరుగుతున్నాయని, ఈ మొత్తాన్ని 15శాతానికి పెంచి ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. జిల్లాలో వివిధ ఉత్పత్తులు, వాటి ధరలు పెంచేలా వినూత్నంగా ఆలోచన చేసి నివేదికను తయారు చేయాలన్నారు. అధికారులతో పాటు, రైతులు, ప్రజా ప్రతినిధులు, చేనేత సహకారసంఘాలు, మత్స్యసహకార సంఘాల ప్రతినిధులను నివేదిక తయారీలో భాగస్వాములను చేసి వారినుంచి సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్థక, ఆక్వారంగం ఉత్పత్తులలో నాణ్యతను, ధరలను పెంచడానికి ఎలాంటి అవకాశాలు ఉన్నాయో గుర్తించాలన్నారు. పంట భూములను ఖాళీగా ఉంచకుండా, ఏడాదంతా సాగు చేసేలా, అంతర పంటలు సాగుచేసేలా రైతులను ప్రోత్సాహించి వారి ఆదాయం పెరిగే మార్గాలను నివేదికలో పొందుపరచాలన్నారు. మండలస్థాయిలో ఆర్థికపరమైన కార్యకలాపాలు ఏయే అంశాల్లో అధికంగా జరుగుతున్నాయో గుర్తించి, ఆ విభాగాల్లో ఆదాయమార్గాలను మరింతగా పెంచేందుకు నివేదికను తయారు చేయియాలన్నారు. కొందరు రైతులు వినూత్నంగా పంటలు పండిస్తూ అధిక దిగుబడులు సాధిస్తుంటారని, అలాంటి విషయాలను వెలుగులోకి తెచ్చి, ఇతర రైతులు కూడా ఈ పద్ధతుల్లో వ్యవసాయం చేసేలా ప్రోత్సాహం అందించాలని అన్నారు. తానుకూడా ప్రతి నియోజకవర్గంలో పర్యటించి స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడి నివేదికను పక్కాగా తయారుచేసేందుకు కృషి చేస్తానని కలెక్టర్ తెలిపారు. ఎస్సీ, బీసీ తదితర కార్పొరేషన్లద్వారా పేదప్రజలకు ఆర్థికభరోసా కల్పించి జీవనోపాధిని మెరుగుపరిచే దిశగాను నివేదిక ఉండాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి డీఆర్వో శ్రీదేవి, సీపీవో గణేష్, డీఆర్‌డీఏ పీడీ నాగేశ్వరనాయక్, జిల్లాపరిశ్రమల అధికారి వెంకట్రావ్, ఏపీఐఐసీ జెడ్ఎం సీతా రామయ్య తదితరులు పాల్గొన్నారు.

సోమవారం 'మీకోసం' రద్దు

26న కృష్ణాష్టమి ప్రభుత్వసెలవురోజుగా ప్రకటించడంతో సోమవారం కలెక్టరేట్‌లో జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదిక(మీకోసం) కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు కలెక్టర్ బాలాజీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.



బాస్కెట్ బాల్ విజేతలతో వి.నారాయణరావు

బాస్కెట్ బాల్ ద్వితీయ విజేత కేబీఎన్

వన్‌టౌన్, ఆగస్టు 24 : విజయవాడ మేరీ స్టెల్లా కాలేజీలో ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించిన ఉమ్మడి కృష్ణాజిల్లా ఇన్విటేషన్ బాస్కెట్ బాల్ పోటీలలో కేబీఎన్ కళాశాల క్రీడాకారులు ద్వితీయ విజేతగా నిలిచారు. శనివారం క్రీడాకారులకు కళాశాల చాంబర్‌లో అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎస్‌కెపివివి హిందూ హైస్కూల్ కమిటీ విద్యా సంస్థల పరిపాలనాధికారి వి.నారాయణరావు మాట్లాడుతూ, బాస్కెట్ బాల్ పోటీలలో ఫైనల్స్ వర్షం కారణంగా మధ్యలో ఆగిపోయాయన్నారు. టాస్ ద్వారా తమ కాలేజీ టీమ్‌కు ద్వితీయ స్థానం లభించిందన్నారు. క్రీడా విభాగాధిపతి డి.హేమచంద్రరావు, క్రీడాకారులను ఆయన అభినందించారు. ప్రిన్సిపాల్ జి.కృష్ణవేణి, వైస్ ప్రిన్సిపాల్ పీఎల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

కృష్ణలంక : ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఈనెల 26వ తేదీన శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగ, ప్రభుత్వ సెలవు దినం కావడంతో రద్దు చేయడం జరిగిందని ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

జెన్పాక్ట్‌లో ఉద్యోగావకాశాలు

మచిలీపట్నం టౌన్ : జెన్పాక్ట్ కంపెనీలో ఉద్యోగావకాశాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, ఉపాధి కల్పనాధికారి విక్టర్‌బాబులు తెలిపారు. జెన్పాక్ట్ కంపెనీలో 1500 ఖాళీలు భర్తీచేస్తున్నారని, డిగ్రీ, బిటెక్ పాసైన అభ్యర్థులు ఈనెల 28లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9988853335లో సంప్రదించాలన్నారు.

ఉపాధ్యాయులకు పునశ్చరణ తరగతులు

ఉయ్యూరు : మారిన సిలబస్‌కు అనుగుణంగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని గుడివాడ డీవైఈవో ఎం.పద్మారాణి అన్నారు. పదవ తరగతి పాఠ్యపుస్తకాలు మారిన నేపథ్యంలో పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు, తోట్లవల్లూరు, పమిడిముక్కల మండలాలకు సంబంధించిన జిల్లాపరిషత్, ప్రభుత్వ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలకు చెందిన జీవశాస్త్రం బోధించే ఉపాధ్యా యులకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఒకరోజు పునశ్చరణ కార్యక్రమం నిర్వహించారు. మారిన పాఠ్యపుస్తకానికి ఏవిధానంలో బోధించాలి, ఎలాంటి కృత్యాలు నిర్వహించాలన్న వాటితో పాటు పదవ తరగతి పరీక్ష మోడల్‌పేపర్‌కు అనుగుణంగా ఏవిధంగా శిక్షణ ఇవ్వాలన్న అంశాలను రిసోర్స్‌పర్సన్‌లు సవివరంగా తెలియజేశారు.

యథేచ్ఛగా మట్టి దోపిడీ!

నందిగామ : మైనింగ్, రెవెన్యూ శాఖల అవినీతి, అలసత్వంతో యథేచ్ఛగా మట్టి దోపిడీ జరుగుతోంది. అధికారుల తీరుతో కూటమి ప్రభుత్వ లక్ష్యాలకు తూట్లు పడుతున్నాయి. జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా నందిగామ సమీపంలోని రాఘవాపురం కొండను తవ్వి గుత్తేదారులు కోట్లాది రూపాయల విలువైన మట్టిని కొల్లగొడుతూ లబ్ధి పొందుతున్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో మట్టి దోపిడీకి అలవాటు పడిన అక్రమార్కులు దానిని కొనసాగించడం విస్మయానికి గురిచేస్తున్నది. నందిగామ వై జంక్షన్ సమీపంలో నిర్మాణంలో ఉన్న రోడ్డు పనులకు రాఘవాపురం కొండ నుంచి రాత్రి, పగలు తేడా లేకుండా మట్టిని రవాణా చేస్తున్నట్టు సీపీఐ నాయకులు ఆరోపిస్తున్నారు. ఆర్డీవో కార్యాలయానికి అతి సమీపంలో పెద్దఎత్తున మట్టి దోపిడీ జరుగుతున్నా పట్టనట్టు రెవెన్యూ అధికారులు వ్యవహరిస్తున్నారన్నారు. నందిగామలో మైనింగ్ కార్యాలయాన్ని విజయవాడకు మార్చటంతో ఫిర్యాదు చేయాలన్నా అధికారులు అందుబాటులో ఉండటం లేదన్నారు. మైనింగ్, రెవెన్యూలో కొందరు అవినీతి అధికారుల సహకారంతో ఎటువంటి అనుమతులూ లేకుండా మట్టి రవాణా చేస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. అక్రమ మట్టి రవాణాపై సీపీఐ నాయకులు ఆందోళనలు చేస్తున్నా మట్టి దోపిడీ మాత్రం ఆగడం లేదు. హైవే అథారిటీ అధికారులైనా సదరు మట్టి ఎక్కడ నుంచి వస్తుందన్న విషయాన్ని స్పష్టం చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. ఇప్పటికైనా మైనింగ్, రెవెన్యూ అధికారులు స్పందించి సహజ వనరుల దోపిడీని అరికట్టాల్సి ఉందని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

నిబంధనలకు తూట్లు



బైపాస్ నిర్మాణంలో వినియోగిస్తున్న కొండ మట్టి

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	114, 123, 134
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.75

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 24 : వీరవల్లిలో వాణి విద్యా నికేతన్, హనుమాన్‌జంక్షన్‌లోని విశ్వకవి, సిద్ధార్థ విద్యాలయాల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు కృష్ణుడు, గోపిక వేషధార ణలతో అలంకరించారు. శ్రీకృష్ణుని పూజ అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. విశ్వకవి స్కూల్‌లో విజేతలకు కరస్పాండెంట్ ముఖర్జీ, అనిత బహుమతులు అందజేశారు. వాణివిద్యానికేతన్‌లో ప్రిన్సిపాల్ నందిం గం రవికుమార్ బహుమతులు అందజేశారు. సిద్ధార్థ విద్యాలయంలో హెచ్‌ఎం ధనలక్ష్మి, శ్రీదేవి బహుమతులు అందజేశారు.



మత్తుతో జీవితాలు చిత్తు

సెంట్రల్ జోన్ ఏసీపీ దామోదర్

గుణదల, ఆగస్టు 24: మాదకద్రవ్యాల బారిన పడి జీవితాలను అంధకారం చేసుకోవద్దని యువతను సెంట్రల్ జోన్ ఏసీపీ కె.దామోదర్ హెచ్చరించారు. ఎనికేపాడులోని ఎస్ఆర్‌కె ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం యాంటి ర్యాగింగ్ వీక్ సెలబ్రేషన్స్ జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సెంట్రల్ జోన్ ఏసీపీ కె.దామోదర్ హాజరయ్యారు. యువతను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, మత్తుతో జీవితాలను బుగ్గిపాలు చేయాలని శత్రుదేశాలు కంకణం కట్టుకున్నాయని అందులో భాగంగానే నేడు అనేక రాష్ట్రాల్లో మాదకద్రవ్యాల రవాణా పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి సమయంలో యువతలో చైతన్యం వస్తేనే మాదకద్రవ్య రహిత సమా జస్థాపన సాధ్యపడు తుందని తెలిపారు. దీనికి యువత ప్రధానంగా సహకరిం చాల్సిన అవసరం ఉందన్నారు. ఆంధ్రా తెలంగాణా రెండు రాష్ట్రాల్లోనూ మాదకద్రవ్యాల వాడకాన్ని పూర్తిగా నిషేధిం చడం జరిగిందని చెప్పారు. ఈదశలో ఎవరైనా మాదకద్రవ్యాలు వాడుతున్నట్లు తెలిస్తే అటువంటి వారి సమాచారాన్ని ముందుగా పోలీసులకు జారవేయాలని కోరారు. సమాచారం అందజేసిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో పటమట సీఐ పవన్ కిషోర్ కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎస్ఆర్‌కేలో యువతను ఉద్దేశించి మాట్లాడుతున్న సెంట్రల్ జోన్ ఏసీపీ కె.దామోదర్



వీరవల్లి హైస్కూల్లో..

వీరవల్లి హైస్కూల్‌లో..

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : మత్తుపదార్థాల విని యోగం వల్ల విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడిపో తుందని వాటికి దూరంగా ఉండి తమ ఉజ్వల భవిష్యత్తుకు బంగారుబాటలు వేసుకోవాలని నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు సూచించారు. వీరవల్లి హైస్కూల్ హెచ్‌ఎం నిర్మల పర్యవేక్షణలో నవ జీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల దుర్విని యోగం, దుష్పరిణామాలపై శనివారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మానసిక వికాస కేంద్రం కో-ఆర్డినేటర్ నజ్మా మాట్లాడుతూ, మాదక ద్రవ్యాల కు అలవాటుపడిన వారికి చికిత్స అందించేందుకు పోల సానపల్లిలో బోస్కో డీ ఎడిక్షన్ ఏర్పాటు చేయడం జరిగిం దని తెలిపారు. ఈ కార్యక్రమంలో మానసిక వికాస కేంద్రం కో- ఆర్డినేటర్ జాకబ్‌రాజు, జోనల్ కో-ఆర్డినేటర్ విజయరాణి, జగతి, జ్యోతి, అరుణకుమారి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బ్యాగ్‌లు పంపిణీ చేస్తున్న ఎంఈవో సాంబశివరావు

విద్యార్థులకు బ్యాగ్‌ల పంపిణీ

ఉంగుటూరు, ఆగస్టు 24: ప్రభుత్వ పాఠశాలల్లో చ దివే పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని ఎంఈవో-2 జె.సాంబశివరావు అన్నారు. మండ లంలోని తేలప్రోలు జడ్పీహైస్కూల్‌లో ఇంటర్ విద్యార్థు లకు సమగ్రశిక్ష ప్రాజెక్ట్ ద్వారా ప్రభుత్వం సరఫరా చేసిన స్కూల్‌బ్యాగ్స్‌ను పాఠశాల హెచ్‌ఎం.ఆదిలక్ష్మితో కలిసి శని వారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ అడిగర్ల పైడితల్లి, వైస్‌ఛైర్మన్ గుడ్డేటి స్టాలిన్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీరవల్లి ఎస్సైగా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ



హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 24 : ప్రజాజీవనానికి విఘా తం కలిగిస్తూ అవాంఛనీయ ఘటన లు నిర్వహించినా, ప్రోత్సహించినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుం టామని ఎస్సై శ్రీనివాస్ హెచ్చరిం చారు. వీరవల్లి ఎస్సైగా శ్రీనివాస్ శని వారం బాధ్యతలు స్వీకరించారు. గ్రామీణ ప్రాంతాల్లో అసాంఘిక చర్యలను అడ్డుకునేందుకు ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని ఎస్సై శ్రీనివాస్ కోరారు.

ఆటోడ్రైవర్ అదృశ్యంపై ఫిర్యాదు

ఉయ్యూరు, ఆగస్టు 24 : చినఓగిరాలకు చెందిన శేశెట్టి ప్రేమనాథ్ (40) వారం రోజులు క్రితం ఇంటినుంచి కన్పి ంచకుండా వెళ్లిపోయినట్టు భార్య జ్యోత్స్న ఉయ్యూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న ప్రేమనాథ్ కన్పిం చకుండా వెళ్లిపోయాడని చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అతని ఆచూకీ కోసం గాలిస్తున్నట్టు రూరల్ ఎస్సై సీహెచ్. సురేశ్‌బాబు తెలిపారు.

పేద విద్యార్థులకు అండగా..



బస్సు పాసులను చూపుతున్న విద్యార్థులు

గన్నవరం, ఆగస్టు 24 : పేద విద్యార్థులకు అండ గా నిలవడం అభినందనీయమని సర్పంచ్ ఈలప్రోలు శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని సూరంపల్లి జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు ఉచితంగా బస్సుపాస్‌లను కేవీఆర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో శనివారం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో చదు వుతున్న విద్యార్థులకు ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని చెప్పారు. ప్రభుత్వంతో పాటు దాతలు సహకారం కూడా ప్రభుత్వ పాఠశాలలకు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రముఖ న్యాయవాది కేవీ రమణ మాట్లాడుతూ, పేద విద్యార్థులకు కేవలం కిషోర్ అందిస్తున్న సేవలు అపూర్వ మన్నారు. నియోజకవర్గం అన్ని పాఠశాలలో విద్యార్థులకు బస్సుపాసులకు ఉచితంగా అందించాలని ఆలోచన రావడం గొప్ప విషయమన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు, కేవీఆర్ కిషోర్, హెచ్‌ఎం తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య అవగాహన సదస్సు నేడు

ఉయ్యూరు, ఆగస్టు 24 : సిద్ధార్థ యోగ విద్యాలయం ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం 3-30 గంటలకు స్థాని క కన్యకాపరమేశ్వరీ ఆర్యవైశ్య ప్రార్థనామందిరంలో ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు నిర్వాహ కురాలు ఈఎల్ రాజేశ్వరి తెలిపారు. రామచంద్ర, పద్మ ఆరోగ్యంపై అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు.

నేటి నుంచి హోమియో వైద్యశిబిరం

ఉంగుటూరు, ఆగస్టు 24 : స్వర్ణభారత్‌ట్రస్ట్(విజ యవాడ చాప్టర్), జీవీ చలపతిరావు మెమోరియల్ హోమియోపతిక్ ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నుంచి 28వ తేదీ (బుధవారం)వరకు ఆత్కూరులోని స్వర్ణ భారత్ ట్రస్ట్ ఆరోగ్యకేంద్రంలో ఉచిత హోమియో వైద్యశి బిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.పర దేశి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లా డుతూ, ప్రతి రెండు నెలలకోసారి వరుసగా నాలుగు రోజు లపాటు ఈ ఉచిత హోమియో వైద్యశిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు. వివరాలకు 9343094787 ఫోన్‌నెంబ ర్‌లో సంప్రదించాలని డైరెక్టర్ సూచించారు.

తాడిగడపలో ఫుడ్‌కోర్టు ప్రారంభం



ఫుడ్‌కోర్టును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, కమిషనర్

పెనమలూరు, ఆగస్టు 24 : తాడిగడప జాతీయ రహదారిపై వంతెనల వద్ద శనివారం స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు ఫుడ్‌కోర్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎంజీ రోడ్డు తరహాలోనే తాడిగడపలో సామాన్యునికి కూడా అందుబాటులో వివిధ రకాల ఆహారపదార్థాలు లభ్యమయ్యే ఏర్పాటు చేసిన మామిళ్లపల్లి పవన్ తదితరులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి హేమచౌదరి, యువనాయ కులు బోడె వెంకట్రామ్, అనుమోలు ప్రభాకరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్, తోట కూర ప్రసాద్ తదితరులు ఉన్నారు.

●పోరంకిలోని వెంకటాపురం కాలనీలో క్రెడాయ్ ఆధ్వర్యంలో జరిగిన మొక్కలు నాటే కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు అనుమోలు ప్రభా కరరావు, వడ్లమూడి శుభశేఖర్, క్రెడాయ్ ప్రెసిడెంట్ రమణారావు, క్రెడాయ్ విజ యవాడ ప్రెసిడెంట్ దాసరి రాంబాబు, కార్యదర్శి శ్రీధర్, ట్రెజరర్ తుమ్మల వంశీ, సీహెచ్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా, గోదావరి జలాల హక్కుల కోసం ఆళ్ల పోరాటం అభినందనీయం : యార్లగడ్డ



ఆళ్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 24 : కృష్ణా, గోదావరి జలాల హక్కుల కోసం రైతుల తరఫున పోరా టం చేయడంతో పాటు రైతుల సాగు నీటి హక్కులు సాధించేందుకు రాష్ట్ర సాగునీటి సమాఖ్య అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణ అందిస్తున్న సేవలు అభినం దనీయమని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంక ట్రావు అన్నారు. ఆళ్ల గోపాలకృష్ణ జన్మదినోత్సవం సందర్భంగా మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆళ్లతో కేక్‌కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీ అశోక్‌బాబు, ప్రాజెక్ట్ కమిటీ మాజీ ఛైర్మన్లు యనమద్ది పుల్లయ్యచౌదరి, చెన్నుపాటి శ్రీధర్, తదితరులు ఆళ్లను సత్కరించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దయాల రాజేశ్వరరావు, వేములపల్లి శ్రీనివాస రావు, గుండపనేని ఉమావరప్రసాద్, మూల్పూరి సాయికళ్యాణి, తదితర నాయకులు పాల్గొన్నారు.

మాతృభాషపై మక్కువ చూపించాలి

ఉయ్యూరు, ఆగస్టు 24 : పరాయి భాష మోజులో పడి మాతృభాష తెలుగును మృతభాషగా తయారు చేస్తున్నారని, మాతృభాషపై మక్కువ చూపించాలని హైదరాబాద్ విశ్వవిద్యాలయం తెలుగు విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ పి. విజయ్‌కుమార్ అన్నారు. ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో ఆధునిక కవితా వికాసం అనే అం శంపై శనివారం నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల నుద్దేశించి మాట్లాడుతూ, పరాయి భాష మోజులో పడి తెలుగుభాషకు సరైన ఆదరణ ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. తమిళ కవి సుబ్రహ్మణ్య భారతి తెలుగుభాషపై ఎక్కువ మక్కువ చూపిం చారని గుర్తుచేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్ మాట్లాడుతూ, అంతరించి పోతు న్న తెలుగు భాషను ముందు తరాల వారికి అందించాలన్నారు. కళాశాల ప్రత్యేక అధికారి కె.సత్యనారాయణ, ఎంఎల్‌ఎస్ కుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు చేయించుకోవాలి



ముక్కపాడులో ఈ -పంట నమోదును పరిశీలిస్తున్న ఏవో హరీష్‌కుమార్

ఉంగుటూరు, ఆగస్టు 24 : ఈ-పంట నమోదు చేయించిన రైతులు మాత్రమే ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులని ఏవో వీవీఎస్ఆర్ఎస్ హరీష్ కుమార్ స్పష్టం చేశారు. మండలంలోని ముక్కపాడులో జరుగుతున్న ఈ-పంట నమోదు ప్రక్రియను శనివారం క్షేత్రస్థా యిలో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు ఈ-పంట నమోదుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్ర మంలో ఏఈవో బి.దుర్గానాగేశ్వరరావు, వీఏఏ దుర్గాప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాల ఆధారంగానే పథకాల అమలు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్‌వో ఆనంద్‌కుమార్, ఏవో

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : పంటకోత ప్రయోగాలు ఆధారం గానే ప్రభుత్వం పథకాలు అమలు చేస్తుందని డివిజనల్ స్టాటిస్టికల్ అధికారి ఆనంద్‌కుమార్ అన్నారు. బాపులపాడు మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏవో భవాని ఆధ్వర్యంలో శనివారం నిర్వహిం చిన ఖరీఫ్- 2024 పంటకోత ప్రయోగాలపై శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పంట కోత ప్రయోగాల విధివిధానాలు వివరించారు. ఉద్యాన పంటలైన అరటి, పసుపు, తదితర పంటలకు వాతావరణ ఆధారిత బీమా వర్తిస్తుందన్నారు. ఏఎస్ఓ అప్పారావు, హరిశ్చంద్, వీఏఏలు, వీహెచ్‌ఏలు పాల్గొన్నారు.

పీవీపీ సిద్ధార్థలో డీఎస్టీ సెర్బ్ స్పాన్సర్డ్‌పై వర్క్‌షాప్

పెనమలూరు, ఆగస్టు 24 : స్థానిక పీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో ఏఐ ఐనాబల్డ్ బయో సెన్సార్ టు కంట్రోల్ ఎయిర్ కండిషనర్ అనే కార్యక్రమంపై డీఎస్టీ సెర్బ్ స్పాన్సర్డు ఒక రోజు వర్కు షాపు శనివారం నిర్వహించారు. సైంటిఫిక్ సోషల్ రెస్పాన్సిబి లిటీలో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో మెకానికల్ డిపార్టుమెంట్ ఫ్యాకల్టీ డాక్టర్ పీ అనూష మాట్లాడుతూ, జీఎస్టీ సెర్బ్ నుంచి షుమారు రూ. 16.5 లక్షలు రీసెర్చ్ ప్రాజెక్టు కోసం మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమానికి వివిధ ఇంజనీరింగ్ కళాశాలల నుంచి 25మంది ఫ్యాకల్టీ హాజరయ్యారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కే శివాజీబాబు మాట్లాడుతూ, మల్టీ డిసి ప్లినరీ ప్రాజెక్టుల ప్రాముఖ్యత ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎంఆర్ఎస్ నిరంజ న్‌కుమార్, మెకానికల్ హెడ్ డాక్టర్ రఘుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ చొరబాటును నియత్రించాలని ఫిర్యాదు

ఉయ్యూరు, ఆగస్టు 24 : చాంద్‌నగర్‌లో తన సొంత స్థలానికి సంబంధించి వివాదం కోర్టు పరిధిలో ఉండగా కొందరు చొరబాటుకు చేస్తున్న ప్రయత్నాన్ని నియంత్రించాలని కోరుతూ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎంఎస్ డెవలపర్స్ అధినేత మస్తాన్ ఫిర్యాదు చేశారు. స్థానిక బస్‌స్టాండ్ వెనుక చాంద్‌నగర్ పేరుతో ఐదు ఎకరాల్లో 2010లో రియల్‌ఎస్టేట్ వెంచర్ వేయగా దానికి సమీ పంలో ఇటీవల వై. శ్రీనివాసరావు, కొందరు కలిసి మరో వెంచర్ ఏర్పాటు చేసి దానిలోకి వెళ్లేందుకు దానపత్రం సృష్టించి చాంద్ నగర్‌లోని తన సొంత రోడ్డు నుంచి రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్నారని, ఏవిధమైన హక్కు లేకుండా తన స్థలంలో నుంచి వెళ్లేందుకు జరుగుతున్న పనులను అడ్డుకుని తనకు న్యాయం చేయాలని కోరుతూ పట్టణ సీఐ రామారావుకు అందజేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	114, 123, 134
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.4.75

సుబ్బారాయుడికి వెండి పళ్లెం బహూకరణ

మోపిదేవి, ఆగస్టు 24: సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి హైదరాబాద్‌కు చెందిన కొల్లి రామసుబ్బారెడ్డి వెండి పళ్లాన్ని బహూకరించారు. శనివారం కుటుంబసభ్యులతో కలసి స్వామిని దర్శించుకున్నాక 998 గ్రాముల బరువు గల రూ.1,02,000 విలువైన వెండి పళ్లాన్ని ఆలయ ఈవో ఎస్.ఎస్.చక్రధరరావుకు అందజేశారు. ఆలయ అధికారులు దాతను సత్కరించి స్వామి ప్రసాదం అందజేశారు.



ఈవో చక్రధరరావుకు వెండి పళ్లెం అందజేస్తున్న దాత

ఉపాధి నిధుల విడుదలతో.. పంచాయతీలకు మహర్దశ

● జగన్ పంచాయతీ నిధులు దారి మళ్లిస్తే..

చంద్రబాబు, పవన్ అభివృద్ధికి బాటలేస్తున్నారు: బండి రామకృష్ణ

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 24: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద రాష్ట్రంలోని 13,256 పంచాయతీలకు నిధులు విడుదల చేసిన ఘనత సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కే దక్కిందని, దీంతో పంచాయతీలకు మహర్దశ వస్తుందని, అభివృద్ధి బాటలో పయనిస్తాయని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ అన్నారు. శనివారం జనసేన మచిలీపట్నం పార్టీ కార్యాలయంలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు జనసేన నాయకులతో కలిసి బండి రామకృష్ణ పాలాభిషేకం చేశారు. వైసీపీ పాలనలో కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ఇచ్చిన నిధులను సర్పంచ్‌లకు చెప్పకుండా జగన్ తన అకౌంట్‌లోకి మళ్లించారని ఆయన విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఒకే రోజు రాష్ట్రంలోని అన్ని పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి గ్రామప్రజల అవసరాలు తెలుసుకుని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని అన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రోడ్లు, చెరువుల తవ్వకాలతో పాటు కోళ్లు, గొర్రెల పెంపకందారులకు అవకాశం కల్పించడం ముదావహమన్నారు. గ్రామసభల నిర్వహణతో ప్రజల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయని తెలిపారు. ఐదేళ్ల వైసీపీ పాలనతో ప్రజలు విసిగిపోయారన్నారు. కూటమి ప్రభుత్వమొచ్చాక మళ్లీ అభివృద్ధికి బాటలు పడుతున్నాయని సంతోషం వ్యక్తంచేశారు. నాయకులు గడ్డం రాజు, గల్లా తిమోతి, బొమ్మసాని నరేష్, పినిశెట్టి వేణు, జన్ను నాగరాజు, వడ్డి చిరంజీవి, మోకా రవి, పామర్తి రాజేష్, హేమశ్రీ, లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న జనసేన మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ తదితరులు

వ్యవసాయ కూలీ అనుమానాస్పద మృతి

మోపిదేవి, ఆగస్టు 24: వ్యవసాయ పనికి వెళుతూ పొలం గట్టుపై పడి కూలీ మృతి చెందిన ఘటన మోపిదేవిలంకలో శనివారం జరిగింది. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదుచేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా మహేంద్రవాడ గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డి(38)కి అవనిగడ్డకు చెందిన సత్తి రాజేశ్వరితో పదేళ్ల క్రితం వివాహమైంది. అప్పటి నుంచి మోపిదేవిలో జీవిస్తున్నారు. వ్యవసాయ కూలీగా పనిచేసే శ్రీనివాసరెడ్డి మోపిదేవి లంకలో పొలం పనికని ఉదయం 6 గంటలకు బయల్దేరి వెళుతుండగా మధ్యలో ఓ పొలం గట్టుపై పడిపోయి ఉన్నాడు. వెనుక వచ్చిన కూలీలు చూసి అతని భార్యకు సమాచారమిచ్చారు. ఆమె వెళ్లి చూసి, గట్టుపై పడి ఉన్న శ్రీనివాసరెడ్డిని అవనిగడ్డ వైద్యశాలకు తీసుకెళ్లింది. అప్పటికే శ్రీనివాసరెడ్డి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరికి గాయాలు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 24: సుల్తానగరం సుమ కన్వెన్షన్ హాలు వద్ద శనివారం ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బైక్‌లపై కంచాకోడూరు గ్రామానికి చెందిన గణపతిరావు, చినపారుపూడికి చెందిన కొల్లూరి సుబ్బారావు ఎదురుగా వస్తుండగా ఒకరినొకరు ఢీకొన్నారు. దీంతో గాయపడిన వారిద్దరినీ జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

కోడూరు, ఆగస్టు 24: వినాయక చవితి సందర్భంగా ఉత్సవాలు నిర్వహించే వారు వినాయక విగ్రహాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఎస్సై శిరీష సూచించారు. ఉత్సవ నిర్వాహకులు ముందుగా కమిటీని ఏర్పాటు చేసుకోవాలని, ఉత్సవాలు పూర్తయ్యే వరకు ఆ కమిటీ వారే పూర్తి బాధ్యత వహించాలని ఆమె స్పష్టం చేశారు. బహిరంగ ప్రదేశాల్లో విగ్రహాలు ఏర్పాటు చేస్తే పంచాయతీ అనుమతి, సొంత స్థలాల్లో ఏర్పాటు చేస్తే యజమాని అనుమతి పొందాలని సూచించారు. మైక్‌లు, సౌండ్ బాక్సులు పెట్టుకోవడానికి పోలీస్‌స్టేషన్ ద్వారా డీఎస్పీ వద్ద అనుమతి తీసుకోవాలని, డీజేలకు అనుమతులు లేవని తెలిపారు. రాత్రి 10గంటల తర్వాత ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించకూడదని ఎస్సై స్పష్టంచేశారు.

ఎరువులు, పురుగుమందులు అధిక ధరలకు అమ్మితే చర్యలు

కోడూరు, ఆగస్టు 24: పురుగుమందులు, ఎరువులు నిర్ణీత ధరలకే విక్రయించాలని, అధిక ధరలకు అమ్మితే చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి ఎం.శ్రీధర్ హెచ్చరించారు. శనివారం కోడూరులో ఎరువులు షాపులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు అవసరమైన అన్ని ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంచేలా చూడాలని డీలర్లకు సూచించారు. వ్యవసాయ అధికారుల సిఫార్సు మేరకే ఎరువులు, పురుగుమందులు వాడాలన్నారు.

మత్స్యకార భరోసాపై ఆందోళన వద్దు

అవనిగడ్డ, ఆగస్టు 24: సముద్రంలో చేపల వేట నిషేధ కాలంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మత్స్యకార భరోసా పథకంపై మత్స్యకారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మత్స్యకారుల రాష్ట్ర నేత లకనం నాగాంజనేయులు తెలిపారు. శనివారం అవనిగడ్డలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మత్స్యకారుల భృతిని రూ.10 వేల నుంచి రూ.20 వేలకు కూటమి ప్రభుత్వం పెంచుతుందని మత్స్యశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారని తెలిపారు. బోట్ల ఎన్యుమరేషన్‌లో సాంకేతిక కారణాల వల్ల మత్స్యకార భరోసా నగదు చెల్లింపులో జాప్యం జరిగిందన్నారు. త్వరలో ఆ సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు.

అసిస్టెంట్ బీసీ సంక్షేమ అధికారిగా ఆలియా బేగం

కూచిపూడి, ఆగస్టు 24: కూచిపూడి వెనుకబడిన తరగతుల బాలికల హాస్టల్ వెల్ఫేర్ అధికారిణి షేక్ ఆలియా బేగంకు అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారిగా పదోన్నతి లభించింది. మచిలీపట్నం డివిజన్ ఆఫీసుకు బదిలీ చేయటంతో ఆమె రిలీవ్ అయ్యారు. బీసీ బాలికల హాస్టల్ అధికారిగా 2011 నుంచి విధులు నిర్వహిస్తున్నారు.




మోపిదేవి బీసీ బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి బాబూనాయక్

విద్యార్థుల ఆరోగ్య సంరక్షణపై జాగ్రత్తలు తీసుకోండి

● గురుకుల పాఠశాల సిబ్బందికి న్యాయాధికారి బాబూనాయక్ సూచన

మోపిదేవి, ఆగస్టు 24: గురుకుల పాఠశాలలోని విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి అవనిగడ్డ సీనియర్ సివిల్ న్యాయాధికారి బి.బాబూనాయక్ సూచించారు. శనివారం మోపిదేవిలోని బీసీ బాలుర గురుకుల పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాల నిర్వహణపై ప్రిన్సిపాల్ కె.వీరరవిని అడిగి తెలుసుకున్నారు. 500 మందికి పైగా విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలలో సీజనల్ వ్యాధుల రాకుండా ముందు జాగ్రత్త చర్యలు ఏం తీసుకుంటున్నారని ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించారు. ఆరోగ్య సంరక్షణ చర్యలపై పాఠశాల వైద్య సిబ్బంది న్యాయాధికారికి వివరించారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యాబోధన, విద్యార్థులకు అందుతున్న మౌలిక వసతులపై ఆరా తీశారు. వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, మంచినీరు, భోజనం తయారీలో పర్యవేక్షణ ఉండాలని బాబూనాయక్ సూచించారు. శుద్ధి చేసిన నీటిని, వేడిగా ఉన్న ఆహార పదార్థాలనే అందించాలని ఆదేశించారు. తరగతి గదులు, మరుగుదొడ్లు, పాఠశాల ఆవరణ శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. తరచూ పాఠశాల, హాస్టళ్లను సందర్శిస్తానని తెలిపారు. న్యాయవాదులు అంది శివరామకృష్ణ, నరహరిశెట్టి ఈశ్వరరావు పాల్గొన్నారు.

పెడన కమిషనర్‌గా ఎం.గోపాలరావు



పెడన, ఆగస్టు 24: మునిసిపల్ కమిషనర్‌గా ఎం.గోపాలరావు శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన గోపాలరావుకు మునిసిపల్ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు. మునిసిపల్, సచివాలయ ఉద్యోగులతో గోపాలరావు సమావేశమయ్యారు.

28న భూ బాధితుల రాష్ట్ర సదస్సు

● విజయవంతం చేయాలని సీపీఐ పిలుపు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 24: విజయవాడలో ఈనెల 28న నిర్వహించనున్న భూ బాధితుల రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని సీపీఐ మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శి లింగం ఫిలిప్ పిలుపునిచ్చారు. శనివారం సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్లలో వైసీపీ నాయకులు దొంగపట్టాలు సృష్టించి వందల ఎకరాలు దోచుకున్నారని, సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ళు తగులబెట్టడమే దీనికి నిదర్శనమని ఆయన అన్నారు. రాజకీయ నాయకులు భూకబ్జాలు చేసి పేదల ఆస్తులను ఆక్రమించడం దురదృష్టకరమన్నారు. ఓఎల్ రావు, షేక్ సైదా, తురగా లక్ష్మణరావు, అబ్దుల్ బాబు పాల్గొన్నారు.

ఉల్లిపాలెంలో పొలంబడి

కోడూరు, ఆగస్టు 24: వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించేలా రైతులకు మంచి సూచనలు అందించేందుకే పొలం బడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏవో ఎం.శ్రీధర్ తెలిపారు. శనివారం ఉల్లిపాలెంలో పొలంబడి కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు వచ్చేలా రైతులకు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దివిసీమ ఫార్మర్ ప్రొడ్యూసింగ్ ఆర్గనైజేషన్ అవనిగడ్డ సీఈవో ఎం.వినోద్, వీపీఏ నీలిమ, రైతులు పాల్గొన్నారు.

పోలియోను నిర్మూలిద్దాం

● రోటరీ జిల్లా గవర్నర్ ఎం.వెంకటేశ్వరరావు పిలుపు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 24: పోలియో మహమ్మారిని పూర్తిగా నిర్మూలించేందుకు రోటేరియన్లు కంకణం కట్టుకోవాలని రోటరీ జిల్లా గవర్నర్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు (విజయనగరం) పిలుపునిచ్చారు. మచిలీపట్నం రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా లింగం మోజెస్, కార్యదర్శిగా అనుపమ ముఖర్జీతో శనివారం ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. మేఘాలయ వంటి ప్రాంతాల్లో ఇంకా పోలియో వ్యాధి కనిపిస్తోందన్నారు. 75 ఏళ్ల చరిత్ర ఉన్న మచిలీపట్నం రోటరీక్లబ్ మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ జిల్లాలోని మిగిలిన క్లబ్‌లకు మార్గదర్శకంగా నిలవాలన్నారు. రోటరీ అసిస్టెంట్ గవర్నరు జ్యోతి, చల్లపల్లి రోటరీ క్లబ్ అధ్యక్షుడు శివబాబు, న్యాయవాది అజ్మతున్నీసా, సీనియర్ రొటేరియన్ చిత్తజలు సాయిప్రసాద్, సంజయ్, రఘు, సామాజిక కార్యకర్త పీవీఫణికుమార్ మాట్లాడారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించారు. డాక్టర్ హనుమంతరావు, శంకరనాథ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రోటరీ గవర్నర్ వెంకటేశ్వరరావు

విద్యార్థులు క్రమశిక్షణను అలవరచుకోవాలి

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 24: విద్యార్థులు బాల్యం నుంచి క్రమశిక్షణను అలవరచుకోవాలని జడ్పీ సీఈవో ఆనంద కుమార్ సూచించారు. శనివారం భోగిరెడ్డిపల్లి మండల పరిషత్ యూపీ పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులను జనరల్‌నాలెడ్జ్, తెలుగు, సోషల్, సైన్స్ పాఠ్యాంశాల్లోని ప్రశ్నలు అడిగారు. హెచ్ఎం పాపారావు పాల్గొన్నారు.



భోగిరెడ్డిపల్లిలో విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో ఆనందకుమార్

అంతర్గత రహదారుల అభివృద్ధి

అవనిగడ్డ, ఆగస్టు 24: ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చొరవతో అధ్వానంగా ఉన్న అంతర్గత రహదారులను అభివృద్ధి చేస్తున్నారు. ఒకటో వార్డులో రెండు రోడ్లు, ఆర్యవైశ్య కాలనీ సమీపంలోని రెండు రోడ్లు, హరిత హాస్పిటల్ రోడ్డులో పొదలు పెరిగిపోయి రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. ఎమ్మెల్యే ఆదేశాలతో పంచాయతీ సిబ్బంది ఆ రహదారుల్లో పొదలు తొలగించారు. విద్యుత్ అధికారులు దెబ్బతిన్న స్తంభాలు తొలగించి కొత్తవి వేశారు. తాగునీటికి కొత్త కుళాయిలు వేశారు. స్థానికులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

రేపు మచిలీపట్నంలో కృష్ణాష్టమి వేడుకలు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 24: కృష్ణాష్టమి సందర్భంగా సోమవారం ఈడేపల్లి వేడుక ఫంక్షన్ హాలు ప్రాంగణంలో ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు నిర్వహించే కృష్ణాష్టమి వేడుకల్లో కృష్ణ భక్తులందరూ పాల్గొనాలని మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు పిలుపునిచ్చారు. శనివారం తన కార్యాలయం వద్ద కృష్ణాష్టమి వేడుకల ఆహ్వాన పత్రికలను ఆయన ఆవిష్కరించారు. వాసుదేవ గోశాల, మునిసిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ పల్లపాటి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఉదయం 8 గంటలకు గోపూజ, 9 గంటల నుంచి 11 గంటల వరకు హరినామ సంకీర్తన, మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు వేదపారాయణ, 4 గంటల నుంచి 6 గంటల వరకు కోలాట ప్రదర్శన, 6 గంటల నుంచి 6.30 గంటల వరకు కృష్ణుని పూజ, 6.30 గంటల నుంచి 7.30 గంటల వరకు విద్యార్థులతో రాధాకృష్ణుల వేషధారణ పోటీలు, 7.30 గంటల నుంచి 8 గంటల వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. మంత్రి కొల్లు రవీంద్ర, ఇతర అధికారులు కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఉట్టి కొట్టే కార్యక్రమంలో యువతీ యువకులు పాల్గొనాలని కొనకళ్ల పిలుపునిచ్చారు. పల్లపాటి అభినవ్, పి.వి. ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న కొనకళ్ల నారాయణ

స్వర్ణకారుల సంఘం నూతన కార్యవర్గం

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 24: స్వర్ణకారుల సంఘం మచిలీపట్నం అధ్యక్షుడిగా మానేపల్లి దుర్గారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం కన్యకాపరమేశ్వరి దేవస్థానం సమావేశపు హాలులో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.వెంకటరమణ ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శిగా బహరోజు సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా వాసాబత్తుల శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో స్వర్ణకారుల సంఘ నాయకులు గడ్డం రాజు, షేక్ రబ్బాని, భోగాదుల సూరిబాబు, మానేపల్లి బ్రహ్మజీ, గాదె రమణ, దేవు కనకరత్నాచారి, కొరపాక పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

నేటి నుంచి క్రీడా దినోత్సవాలు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 24: జాతీయ క్రీడా దినోత్సవాల సందర్భంగా ఈనెల 25 నుంచి నిర్వహించే కార్యక్రమాల్లో క్రీడాకారులు పాల్గొనాలని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఝాన్సీ పిలుపునిచ్చారు. 25న ఉదయం గాంధీనగర్‌లోని ఉదయపు నడక మిత్ర మండలి హాలులో యోగసాధకులతో కార్యక్రమం, 26న క్రీడాకారుల ప్రతిజ్ఞ, 27న బాలాజీ విద్యాలయంలో, 28న పద్మావతి జూనియర్ కళాశాలలో వివిధ పోటీలు, 29న ఉదయం అంబేడ్కర్ విగ్రహం నుంచి స్టార్ కళాశాల విద్యార్థుల ర్యాలీ, అదే రోజు సాయంత్రం క్రీడాకారులకు బహుమతి ప్రదానం నిర్వహిస్తామన్నారు. 30, 31 తేదీల్లో విద్యార్థులకు ఇండోర్ గేమ్స్ ఆడిస్తారన్నారు. వాతావరణం అనుకూలంగా లేకపోవడం వల్ల ఇండోర్ గేమ్స్ ఆడిస్తున్నామని ఝాన్సీ తెలిపారు. చదరంగం, క్యారం బోర్డు, ఫన్నీ గేమ్స్ నిర్వహిస్తున్నామన్నారు.

రహదారి మరమ్మతులు పరిశీలన

కూచిపూడి, ఆగస్టు 24: భీమనది నుంచి మొవ్వ కోర్టు వరకు ఆర్ అండ్ బీ నిధులు రూ.60 లక్షలతో చేపట్టిన రహదారి మరమ్మతులను పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా శనివారం పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నన్నపనేని వీరేంద్ర, పార్టీ మండల కార్యదర్శి వీరంకి తులసీదాస్ ఉన్నారు.



కూచిపూడి - మొవ్వ రహదారి పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

మగ్బుల్ హుస్సేన్‌కు అభినందన

పమిడిముక్కల: అలీనఖీపాలెం ఇమాం హుస్సేన్ పంజా నుంచి మచిలీపట్నం రాజుపేటలోని జరీ పంజా వరకు కాలి నడకన వెళ్లి మొక్కు తీర్చుకున్న మగ్బుల్ హుస్సేన్‌ను ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా సత్కరించి అభినందించారు. ఎన్నికల్లో పామర్రు నుంచి కుమార్ రాజా ఘనవిజయం సాధించి ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగిడితే కాలినడక వచ్చి మొక్కు తీర్చుకుంటానని హుస్సేన్ మొక్కుకున్నారు. శనివారం మొక్కుతీర్చుకున్న ఆయనను కుమార్‌రాజాతో పాటు, నాయకులు అబ్బాస్ అలీ, జక్కా శ్రీనివాసరావు, అలీం హుస్సేన్, కాండ్రు అంజి అభినందించారు.

పరిశ్రమల సందర్శనతో విజ్ఞాన సముపార్జన

గుడివాడ: పరిశ్రమలను సందర్శించడం ద్వారా విద్యార్థులు విజ్ఞానాన్ని సంపాదించుకోవచ్చని ఏఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీజేఎస్ కుమార్ అన్నారు. శనివారం నందివాడ మండలం తమిరిశలోని ఉమా స్పిన్‌టెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌ను కళాశాల విద్యార్థులు సందర్శించారు. వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్. పద్మజ, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ ఎంబీ సువర్చల, అధ్యాపకులు నాగేంద్రకుమార్, భరత్ కుమార్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు రెడ్‌క్రాస్ సాయం

మోపిదేవి, ఆగస్టు 24: వెంకటాపురంలో ఇటీవల అగ్నిప్రమాదం జరిగి సర్వస్వం కోల్పోయిన పేరుబోయిన నాంచారమ్మకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మోపిదేవి సబ్‌బ్రాంచ్ ఆధ్వర్యంలో నిత్యావసరాలు అందజేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ కృష్ణాజిల్లా శాఖ ద్వారా పంపిణీ చేసిన స్టీలు సామగ్రి, బియ్యం, సరుకులు, కూరగాయలను మోపిదేవి సబ్ బ్రాంచ్ చైర్మన్ యర్రంశెట్టి సుబ్బారావు, సర్పంచ్ తుమ్మా సోములమ్మ అందజేశారు. మోపిదేవి సబ్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు ఆర్.సుబ్రహ్మణ్యం, వీఆర్వో కె.వరప్రసాద్, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా సబ్‌జోన్ ఆటల పోటీలు

అవనిగడ్డ, ఆగస్టు 24: అవనిగడ్డ సబ్ జోన్ బాలికల ఆటల పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. శనివారం నిర్వహించిన బాలికల కబడ్డీ పోటీల్లో అవనిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలికలు ప్రథమ స్థానం, తలగడదీవి జడ్పీ పాఠశాల బాలికలు ద్వితీయ స్థానంలో నిలిచారు. చెస్ అండర్-17లో అవనిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని భవ్యశ్రీ ప్రథమ స్థానం, అవనిగడ్డ నారాయణ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థిని ఎస్.హర్షిత ద్వితీయ స్థానాన్ని సాధించారు. అండర్-14 పోటీల్లో అవనిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన వి.ప్రజ్వలాల్ ప్రథమ, ఎండీ మహ్మద్ షల్మా ద్వితీయస్థానం సాధించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.ఎన్.బి.గోపాల్, అవనిగడ్డ సబ్‌జోన్ వ్యాయామోపాధ్యాయుల సంఘ ప్రతినిధులు కోసూరు పూర్ణచంద్రరావు, జి.మారుతి, ఉదయకుమార్, పీడీలు సనకా శ్రీకాంత్, అమ్ముల భానుప్రకాష్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో పాము, కుక్కకాటుకు మందులు

నాగాయలంక, ఆగస్టు 24: నాగాయలంక, సొర్లగొంది, ఎదురుమొండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో(పీహెచ్‌సీలు) పాము, కుక్కకాటు విరుగుడు మందులు తగినంత ఉన్నాయని తహసీల్దార్ ఎం.హరనాథబాబు, ఎంపీడీవో జె.కె.సీతారామకుమార్‌కు వైద్యాధికారులు వి.శివరామకృష్ణ, ఎం.ఇంద్రకుమార్ రెడ్డి తెలిపారు. మండలంలో వరి నాట్లు ముమ్మరంగా సాగుతుండడంతో పలుచోట్ల పాముకాటుతో ఆస్పత్రులకు బాధితులు వచ్చి చికిత్స పొందుతున్నారు. దీంతో శనివారం నాగాయలంక పీహెచ్ సీని తహసీల్దార్, ఎంపీడీవోలు సందర్శించారు. పీహెచ్‌సీలలో పాము, కుక్కకాటు విరుగుడు మందులున్నాయా లేవా అని వైద్యాధికారులను అడిగారు. ఈనెలలో పాముకాటుకు 34 మంది చికిత్స పొందారని వైద్యులు తెలిపారు. బాధితులు ఏ వేళలో వచ్చినా అందుబాటులో ఉంటామని వైద్యాధికారులు తెలిపారు.

దావోజీపాలెంలో ఉచిత వైద్య శిబిరం

పెడన రూరల్: దావోజీపాలెంలో మాజీ ఎమ్మెల్యే కాగిత వెంకట్రావు బాల్యమిత్రుడు కొమ్మా స్వాములు, ధనలక్ష్మి స్మారకార్థం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ప్రారంభించారు. ప్రజలకు ఉచిత వైద్య సేవలను అందిస్తున్న డాక్టర్లు కొమ్మా బ్రహ్మారావు, కొమ్మా బాలసాయితేజను అభినందించారు. జనరల్ వ్యాధులు, దంత సమస్యలతో ఉన్న 276 మందిని పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. జడ్పీటీసీ సభ్యుడు అర్జా నగేష్, శలపాటి ప్రసాద్, శీరం ప్రసాద్, సర్పంచ్ బొడ్డు చినబాబు, కాగిత లక్ష్మీనాగేశ్వరరావు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నేత్ర వైద్య శిబిరం

చల్లపల్లి: చల్లపల్లిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ వెంకట్రావు 148 మందికి పరీక్షలు చేశారు. 12 మందిని కంటి శుక్లాల ఆపరేషన్లకు ఎంపిక చేశారు. శిబిరాన్ని ఆఫ్ వీఆర్‌కే నగర్ అధ్యక్షుడు రాయపాటి రాధాకృష్ణ, కార్యదర్శి కస్తూరి ప్రసాద్, మాజీ అధ్యక్షులు నర్రా సాయిబాబు, మోపిదేవి వెంకటేశ్వరరావు, ఏ.ఎల్.ఆర్.కె.ప్రసాద్, డి.ధనుంజయరావు, ట్రెజరర్ ముమ్మనేని రాజకుమార్(నాని), దాత కోసూరు శ్రీనివాస్ పర్యవేక్షించారు.

100 మందికి వైద్య పరీక్షలు

నాగాయలంక: మర్రిపాలెం ఎస్టీ కాలనీలో శనివారం యానాది మహానాడు సంఘం ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ శాంతి ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించి 100 మందికి ఉచితంగా మందులు పంపిణీ చేశామని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా విజయబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో యానాది మహానాడు సంఘం జిల్లా అధ్యక్షుడు మంగళగిరి శ్రీనివాసరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ పవన్‌కుమార్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.